# యాద్గిరి ఫ్రమ్ మల్కాజిగిరి !

ఆల్‌బిత్తర్ కంపెనీ యం.డి. యాద్గిరి! వన్ మెన్ ఆర్మీలాగ అన్ని పన్లూ యాద్గిరే చూసుకుంటాడు. హి ఈజ్ ఫ్రమ్ మల్కాజ్‌గిరి.

మల్కాజ్‌గిరిలోనే పుట్టేడు. పెరిగేడు. పైలా పచ్చీసుగ తిరిగేడు. చదువు అబ్బక పోవటంతో టెన్త్‌తో ఫుల్‌స్టాప్ పెట్టాడు.

ఏనుగంతమనిషి! చేతిలో చార్మినార్ సిగరెట్ పాకెట్టు. మెళ్లో పలుపుతాడు లాంటి బంగారు గొలుసు. నల్లగ తారు డబ్బాలాగ వుంటాడు. ముఖమంతా అమ్మోరు పోసిన మచ్చలతో గుంటలు గుంటలుగా వుంటుంది. మెడని తాకుతూ జులపాల జుత్తు. పక్కన మందీ మార్బలం! మనిషిని చూస్తేనే భయమేస్తుంది. పచ్చి నెత్తురు తాగే రౌడీలా అవుపిస్తాడు.

జులాయిగా తిరగటానికి స్వస్తి చెప్పి... రూలింగ్ పార్టీలో కార్యకర్తగా జాయినయ్యాడు. చేతికి అందనంత ఎత్తు ఎదిగాడు అనతికాలంలోనే!

కారుల్లో ఎం.ఎల్‌ఏ.ల సరసన కూర్చోగల స్థాయి! పర్మిషన్లేకుండా మంత్రిగారి ఛేంబర్లోకి వెళ్లగల స్థోమత సంపాదించుకున్నాడు.

ఆ విధంగా బేవార్స్‌గ పెద్ద వాళ్లవెంట తిరగటానికి మనస్కరించలేదు యాద్గిరికి! పైసా సంపాదన లేకుండా ఎన్నాళ్లని వుల్ఫాగా తిరుగుతాడు!

ఇహ ఇట్లా లాభం లేదనుకుని చీట్ల బిజినెస్ నడపటానికి శ్రీకారం చుట్టాడు. చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునే స్థితి యాద్గిరికి బాగా సహాయపడింది.

మల్కాజిగిరిలో ఓ రెండు గదులు రెంట్‌కి తీసుకున్నాడు. చిట్‌ఫండ్ బోర్డ్‌వెలిసింది. శిష్యగణంలో ప్రారంభించబోయే చిట్‌ఫండ్ వివరాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంచి పెట్టించాడు. న్యూస్ పేపర్లన్నింటిలో 'యాడ్స్' వచ్చేసినయ్.

ఇంకేముంది అమాయక ప్రజలు 'క్యూ' కట్టారు. చిట్టీలతో పాటు అత్యధిక వడ్డీ ఇవ్వబడుతుందని ప్రకటించినందున వేల సంఖ్యలో డిపాజిట్ చేసేందుకు జనం ఎగబడ్డారు.

నడిరోడ్డులో రాయివుంటే దేవుడని పసుపు కుంకుమలతో పూజలు చేసే సాంప్రదాయానికి అలవాటు పడిన వారు కావటంతో గొర్రెల మందలాగా బెల్లంమీద మూగే ఈగల్లాగ ఎక్కడెక్కడి వారూ ఎగబడ్డారు.

అనూహ్య స్పందనకు యాద్గిరికి మతిపోయింది. ఇంత పెద్ద ఎత్తున వ్యాపారం ప్రారంభ

మౌతుందని ఊహించలేక పోయాడు.

గొర్రె కసాయి వాడిని నమ్మినట్టు మహానగరంలో బీరబిక్కి యాద్గిరిని నమ్మింది.

ఆఫీసు ప్రారంభోత్సవానికి మంత్రులు ప్రజా ప్రతినిధులు.. అధికారవర్గం... వ్యాపారగణం తరలి రావటంతో అక్కడి సమూహాన్ని కంట్రోలు చేయటం పోలీసు వారి వల్ల కాలేదు.

ప్రారంభోత్సవానికొచ్చిన వారందరికీ పుల్లారెడ్డి స్వీట్సు... కూల్‌డ్రింక్స్ సర్వ్ చేయటం జరిగింది.

వేదిక మీదున్న పెద్దలు అతిరథ మహారథులు యాద్గిరి తెలివి తేటలను... ప్రజా సేవను... నీతి నిజాయితీని పొగిడారు. అతడ్ని ఆకాశానికెత్తేశారు.

త్వరలోనే జంటనగరాల నలుమూలలకు వ్యాపారం విస్తరింపచేయటం ఖాయమని... చిట్‌ఫండ్ కంపెనీ తాలూకూ బ్రాంచీలుకూడా తెరుస్తానని వాగ్ధానం చేసాడు.

యాద్గిరి చేతిలో చార్మినార్ పాకెట్ స్థానంలో మూడైదుల పాకెట్‌వెలిసింది. మోటార్ బైక్ మూలపడేసి లేటెస్ట్ మోడల్ కారు కొన్నాడు. మరో చేతిలో నోకియా సెల్లు.. తెల్లటి గుడ్డల్లో నల్లటి మనిషి నిఖార్సయిన మేలిమి బంగారం లాగా మెరిసి పోతున్నాడు.

అర్నెల్లు తిరక్కముందే ఇరుకైన రెండు గదులు ఖాళీ చేసి పెద్ద బంగళాలోకి ఆఫీసు మార్చాడు. ముఖ్యమైన సెంటర్లలో నాలుగు బ్రాంచి ఆఫీసులు ఊపిరి పోసుకున్నాయ్.

తిరుమల కొండపై నున్న వేంకటేశ్వరస్వామిని నమ్మినట్టు ఎందరో బీద... మధ్య తరగతి... ధనిక వర్గ ప్రజానీకం యాద్గిరిని నమ్మేరు.

కళ్ల ముందు తిరిగిన బిచ్చగాడి వంటి యాద్గిరికి మహర్దశ ఎత్తు కోవటం చూచిన వారందరూ ఆశ్చర్యపోయి ముక్కున వేలేసుకున్నారు. వారందరికీ 'సిరిదా వచ్చిన వచ్చును...' పద్యం గుర్తుకొచ్చింది.

ఏటా ఆదాయం సమృద్ధిగా వస్తోంది. కంపెనీ లాభాలు బాటలో నడుస్తోంది.

డిపాజిటర్స్‌కి వడ్డీ డబ్బులు ఠంచనుగా ఇచ్చేస్తున్నాడు. చీటిపాట డబ్బు కూడా ఎప్పటికప్పుడు పార్టీలకు ఇస్తూ రావటంతో యాద్గిరి మీద విశ్వాసం పెరిగింది!

'నమ్మిచెడినవారు లేరు... నమ్మక చెడిపోరు' అనే నానుడి అక్షరాల శుద్ధ తప్పు అని కొందరు రుజువు చేయటానికే కంకణం కట్టుకుంటారు.

వ్యాపారంలో టర్నోవరు లక్షల నుంచి కోట్లకు చేరుకోగానే యాద్గిరిలో దుర్భుద్ధి పుట్టింది. నమ్ముకున్న వారిని నట్టేట్లో ముంచాలనే దురాలోచన యాద్గిరిని కలవర పెట్టింది.

★★★★★

వన్‌ఫైన్ మార్నింగ్ అందరినెత్తిన తెల్లటి మల్లుగుడ్డ వేసి ఎవ్వరి కంటా పడకుండా బోర్డు తిప్పి యాద్గిరి పరారై పోయినందుకు ఖాతా దారులంతా గగ్గోలు పెట్టారు.

లబో దిబో మన్నారు. తమ సొమ్ము పోయినందుకు గుండెలు బాదుకున్నారు.

పోలీసు రిపోర్టు ఇవ్వటంతో అధికార వర్గం రంగ ప్రవేశం చేసి చిట్‌ఫండ్ ఆఫీసు లన్నింటికి తాళాలు వేసి సీలేయటం జరిగింది!

పొగిడిన నోళ్లే తెగిడాయి!

న్యూస్ పేపర్లన్నీ యాద్గిరి చేసిన మోసాన్ని ఫ్రంట్ పేజీల్లో పెద్ద అక్షరాలలో వ్రాసాయి.

నమ్మి మోసపోయిన ఖాతాదారులకు వత్తాసుగ నాలుగు సానిభూతి మాటలు అచ్చేసి పత్రికలు చేతులు దులుపుకున్నాయ్.

జరిగిన అన్యాయానికి విలపించి ప్రయోజనం లేదని గ్రహించిన కొందరు కలిసికట్టుగా వెళ్లి ముఖ్యమంత్రిని కల్సి వినతి పత్రం సమర్పించి తమకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నారు. కాళ్లమీద పడ్డారు. తమ గోడు విన్నవించుకున్నారు. వలవలా ఏడ్చారు.

ఖాతాదారులను బుజ్జగించి... ధైర్యం నూరిపోసిన ముఖ్యమంత్రిగారు దీనిపై ఎంక్వైరీ కమిటీని వేసి నిజాన్ని నిగ్గు తేలుస్తానని వాగ్దానం చేసారు.

రోజులు...నెలలు.... గడుస్తున్నా....యాద్గిరి ఆచూకీ దొరక్కపోవటంతో కోట్లు మూట గట్టుకుని విదేశాలకి చెక్కేసి వుంటాడనే పుకార్లు నలు మూలలా వ్యాపించాయి.

దేశమంతా గాలించేక యాద్గిరి మాత్రం ఎక్కడున్నాడో తెల్సుకోగలిగినా పోలీసులు అధికార యంత్రాంగం, తమకు తెలీనట్టే నటించి ప్రజలతో అబద్ధం చెప్పారు.

★★★★★

కొన్నాళ్లు ఎవరికంటా పడకుండ అజ్ఞాతంలో వున్న యాద్గిరి ముంబై చేరుకున్నాడు.పేరు మార్చుకుని సినిమా ప్రొడ్యూసర్ అవతారమెత్తాడు.

హిందీ చిత్రాల పట్ల అభిమానం వున్నవాడు కావటంతో నిర్మాతలతో దర్శకులతో పరిచయాలు ఏర్పరచుకున్న యాద్గిరి అలియాస్ బాబ్జీ ఒకటి రెండు చిత్రాలకు సహనిర్మాతగా వ్యవహరించాడు. నిర్మాణంలో అనుభవాన్ని సంపాదించాడు.

స్వతంత్రంగా భారీ తారాగణంతో ఓ సినిమా తీయాలని ప్లాన్ చేస్తున్న సమయంలో ఓ అప్ కమింగ్ హిరోయిన్‌తో సన్నిహితసంబంధాలు ఏర్పడ్డాయ్.

తను తీయబోయే సినిమాలో ఆమే హీరోయిన్ అన్నాడు. ఇద్దరూ కలసి లోకేషన్స్ చూడాలనే

ప్రపోజల్తో విదేశాలు చుట్టివచ్చారు.

యాద్గిరి హిరోయన్ మాయలో పూర్తిగా పడిపోయాడు. ముంబైలో ఆమెకో బంగళా కట్టించాడు. ఎ.సి. కారు కొనిచ్చాడు.

సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. చిత్రంలో వున్న హేమా హేమీలంతా తరలివచ్చి యాద్గిరి తీయనున్న సినిమా విజయవంతం కావాలని ఆశీస్సులు అందించారు.

చిట్‌ఫండ్ కంపెనీ పెట్టి ప్రజల నోళ్లు కొట్టి కాజేసుకొచ్చిన కోట్లాది రూపాయలు మంచుకొండ మాదిరి కరిగిపోతూ వచ్చింది.

సినిమా నిర్మాణం సగమైనా పూర్తి కాకుముందే యాద్గిరి ఫైనాన్షియల్ పోజిషన్ మినిమమ్ బేలెన్స్‌లో కొచ్చింది.

ముందుకు పోగల మార్గం కన్పించక పోవటంతో మనిషి నిరుత్సాహపడి నీరుకారిపోవ నారంభమైంది.

ఈ వరుస క్రమంలో తన పిక్చర్లో హీరోయిన్ ద్వారా అండర్‌గ్రౌండ్ డాన్ చోటాషకీల్ అనుచరులతో పరిచయాలు ఏర్పడటం యాద్గిరికో వరమైంది!

తాను ప్రారంభించిన హిందీ పిక్చరు పూర్తి కావాలంటే మరో అయిదు కోట్ల రూపాయలు కావలసివస్తయ్. అంత బబ్బు తనక్కావాలంటే అండర్ గ్రౌండ్ డాన్ వర్గీయులతో సన్నిహిత సంబంధాలు పెంచుకొని వాళ్లతో చేతులు కలపటం ఒక్కటే సరైన మార్గంగా తోచింది యాద్గిరికి!

వాళ్లతో పరిచయాలు... స్నేహంగ రూపు దిద్దుకుంది. తనూ వారి గ్రూపులో మనిషైనాడు.

వాళ్ల షరతులకు లోబడి వాళ్లు చెప్పిన పనులు చేయటానికి అంగీకరించి సాహసిస్తే తనక్కావలసినంత డబ్బు ఇవ్వటానికి సిద్ధమంటూ డాన్ మనుషులు ముందుకొచ్చారు.

ముందు నాటికి తన పరిస్థితి ఏమౌతోందనే దూరాలోచన లేకుండా తన పబ్బంగడుపు కోవటానికే ప్రాదాన్య మిస్తున్నాడు.వాళ్లు చెప్పిన దానికల్లా సరేనని తలూపాడు యాద్గిరి!

బాంబుల తరలింపు... దొంగ నోట్ల చెలామణి వంటి వ్యవహారాల్లో యాద్గిరి ప్రధాన పాత్ర పోషించటానికి వెనుకాడకుండా.. రంగంలోకి దిగాడు.

షకీల్ ముఠా ఎప్పటికప్పుడు అందించే సూచనలు... మార్గదర్శకాలను తు.చ.తప్పకుండా వాళ్లు చెప్పిన పనులు చేస్తూ వారికి అత్యంత సన్నిహితుడుగా.. నమ్మకమైన వ్యక్తిగా మెలుగుతున్నాడు యాద్గిరి.

తాను చేస్తున్న పనుల్లో తనకు రావలసిన వాటా కింద రావలసిన డబ్బు

ఎప్పటికప్పుడు చేతికి అందుతూండటంతో... మరోవైపు చిత్ర నిర్మాణానికి అవరోధాలు కలక్కుండా శరవేగంతో సినిమా పూర్తి కాబోతోంది.

యాద్గిరి అలియాస్ బాబ్జీ ఇప్పుడొక చిన్నసైజు డాన్‌గ చెలామణీ అవుతున్నాడు. షకీల్ మూఠాతో సంబంధాలు బలపడినాయ్.

ఇన్ని నెలల స్నేహంతో అసలు చోటా షకీల్ అనే వ్యక్తి ఎలా వుండాటో? ఎక్కడ వుంటాడో తెల్సుకోలేక పోయాడు. ఆయన ఎవరికీ కన్పించడని... ఆదేశాలు మాత్రం ఆ క్షణాల్లో చేరతాయని మాత్రమే గ్రహించగలిగాడు.

★★★★★

గుండు గీయించుకుని మీసాలు గొరిగించుకుని మారువేషాలతో... మారు పేర్లతో హైదరాబాద్ బయల్దేర బోతున్న ఆరుగురు ముఠాలో యాద్గిరి కూడా ఒకడు!

జంటనగరాలు యాద్గిరికి కొట్టిన పిండి కావటంతో ఆరుగురు సభ్యుల మూఠాకి యాద్గిరిని లీడర్ని చేసాడు డాన్ ఛోటా షకీల్!

జన సమర్ధంగా వుండే ప్రదేశాలు ఎంచుకున్న చోట బాంబులు పేల్చి ప్రజలను భయభ్రాంతులను సృష్టించి ప్రభుత్వం గుండెల్లో నిద్రపోవటానికే ఆరుగురు ముఠా అనేక మార్గాల గుండా రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్ చేరుకుంది.

సిటీలోమరొకంటికి తెలీకుండా వుండే రహస్య స్థావరంలో మూఠా మకాం ఏర్పరచుకుంది.

బాంబులు పేల్చాలనుకున్న చోట్ల ముందుగ రెక్కీ నిర్వహించారు.

రోజూ రాత్రి వేళ ఆరుగురూ కల్సుకుని రహస్యంగా మాట్లాడుకుని ఓ నిర్ణయానికి రావటం వారి దినచర్య.

ప్లాన్ ప్రకారం.... విధ్వంసాన్ని సృష్టించాలనుకున్న రెండు ప్రదేశాలను నిర్ణయించుకుంది ముఠా.

ఆరుగురు రెండు బేచ్‌లాగా విడిపోయారు. ఒక్కోటీములో ముగ్గురు. ఆ ముగ్గురే సక్సెస్‌ఫుల్‌గా అనుకున్న పనిని పూర్తి చేయటానికి నిర్ణయించుకున్నారు.

లుంబినీ పార్కు, గోకుల్ చాట్ భండార్.... ఆ రెండు ప్రదేశాలను తమ టార్గెట్‌గా నిర్ణయించుకున్నారు.

లుంబినీ పార్క్‌లో విధ్వంసం సృష్టించే ముగ్గురి సభ్యుల ముఠాకి నాయకుడు యాద్గిరి! తాను చేయబోయే ఈ పని విజయవంతమైతే పదికోట్లు తనకు ముడుతుంది!

రాత్రి చీకటి పడింది! అమాయక ప్రజలు పర్యాటకులతో లుంబినీ పార్కుకి క్రిక్కిరిసివుంది!

లేజర్‌షో తిలకించి పులకించాలనే ఆపేక్షతో వచ్చినవారు అత్యుత్సాహంతో కేరింతలు కొడుతున్నారు.

ఆ మధుర క్షణంలో అక్కడ మృత్యుఘంటికలు మోగనున్నాయని ఎవరూహించగలరు?

ఒక్కసారిగా బాంబు పేలిన శబ్దం! ప్రాణ భయంతో అగమ్యంగా పరుగులుపెట్టే ప్రజలు... క్షత గాత్రుల ఆర్తనాదాలు... మృత్యువాతపడి కకావికలమైన కళేబరాలు.

క్షణాల్లో స్మశాన వాటికను తలపించింది అక్కడి వాతావరణం. అసలేం జరిగిందో తెల్సుకునేటందుకు కొన్ని గంటలు పట్టింది.

గోకుల్ చాట్ భాండార్‌వద్ద కూడా అదే పరిస్థితి! యుద్ధ భూమిని తలపిస్తున్నది కోఠీ పరిసరప్రాంతం! మృత్యువాతపడిన అమాయకులు...హాహా కారాలు ఆర్తనాదాలు.. అంతా దిగ్భ్రాంతి చెందారు.

జరగరాని ఘోరం రెండు ప్రదేశాల్లోనూ జరిగిపోయింది. ప్రభుత్వం ఈవార్త విని ఉలిక్కిపడింది. పోలీసులు బెంబేలెత్తారు.

★★★★★

బాంబుస్క్వాడ్లు...పోలీసు కుక్కలు... క్లూస్ టీమ్స్...పోలీసు అధికారులు రంగ ప్రవేశం చేసారు.

విస్ఫోటనం తాలూకు ఆనవాళ్లకోసం అధికారులు తీవ్రంగా గాలింపుచర్య ప్రారంభించారు.

సిటీలో రెడ్ అలర్ట్ ప్రకటించారు!

భయం గుప్పిట్లో జంటనగరవాసులు వణికిపోతున్నారు. ఈ విషాద సంఘటనల గురించి పత్రికలు ఘోషించినయ్.

తీవ్ర గాలింపు చర్యల అనంతరం లుంబినీ పార్క్‌లో విధ్వంసానికి కారకులైన ముగ్గురు తీవ్రవాదుల ముఠా పోలీసులకు పట్టుపడింది.

దేహశుద్ధి చేస్తున్న సమయంలో పోలీసులాఠీ దెబ్బలకూ టార్చర్‌నూ తట్టుకొనలేక లుంబినీ పార్క్‌లో ప్రేలుడికి కారణం అయిన ముఠా నోరు విప్పింది.

గుట్టురట్టయింది... బాంబుపేలుళ్ళకి ఎవరు వ్యూహారచన చేసింది. ఎంత మంది పాల్గొన్నది... ఎవరు చేయించింది ఇంటరాగేషన్లో యాద్గిర పూసగుచ్చినట్టు చెప్పేశాడు.

చాటభాండార్ ప్రేలుడికి కారకులు కూడా తమ ముఠాయేనని అక్కడి విధ్వంసానికి కారకులైన ముగ్గురూ తప్పించుకు పారిపోయారని వివరిస్తూ వాళ్ల పేర్లు చెప్పాడు. వారు తప్పించుకుని ఎటోపారిపోయారో తనకు తెలీదన్నాడు.

యాద్గిరిని మల్కాజిగిరి నివాసిగ పోలీసులు గుర్తించారు. దొరికిన నేరగాళ్ల గురించి పేపర్లన్నీ ప్రముఖంగా ప్రచురించినాయ్.

ఇన్నేళ్లూ దర్జాగాతిరిగి సర్వసుఖాలను అనుభవించిన తాను ఈ విధంగా ఉగ్రవాదంలో ఇరుక్కుని పోలీసుల చేత దేహశుద్ధి చేయించుకున్నందుకు... తమ సిటీ వాసులైన ఎందరో అమాయకుల ప్రాణాలు బలిగొన్నందుకు కన్నీరు మున్నీరుగా దుఃఖించాడు యాద్గిరి.

జంట బాంబు పేలుళ్లకి కారకుడు యాద్గిరే నని తెలుసుకున్న ప్రజానీకం తండోప తండాలుగా తరలివచ్చి కిరాతకంగా అమాయకుల ప్రాణాలు బలిగొన్నందుకు... వారంతా యాద్గిరి ముఖాన కాండ్రించి ఉమ్మేసారు. కసితీరా కచ్చకొద్దీ తిట్టారు.

ఇంతటి దుర్మార్గుడ్ని ఉరితీయాలంటూ నినాదాలు పెద్దపెట్టున చేస్తున్న ప్రజానీకాన్ని అదుపులో పెట్టటం పోలీసుల తరం కాలేదు.

-:(సమాప్తం):-

***(జంటనగరాల్లో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనలో అశువులు బాసిన వారి ఆత్మశాంతికి. క్షతగాత్రులకు సానుభూతితో ఈ కథ కన్నీటితో...అంకితం!!)***